# యేసు, దేవుని యొక్క రాజ్యమునకు రాజు

## Jesus, the King of God's Kingdom

**పాఠము యొక్క ఉద్దేశము** :నూతన నాయకత్వము క్రింద దేవుడు తన రాజ్యమునందు ఫలమును పొందబోవునని చూపించుట.

**లేఖనభాగము** : మత్తయి 21:33-46. మొదటి పాఠమునందు ఈ ఉపమానమునే మనము పఠించితిమని గమనింపుము. దయచేసి చారిత్రక విశ్లేషణా భాగమును పునఃసమీక్షింపుము.

### ఉపోద్ఘాతము

పాత నిబంధన గ్రంథమునందు రాజుగా సొలొమోనుతో దేవుని రాజ్యము ఉనికిలో వున్నదని దినవృత్తాంతముల గ్రంథకర్త చెప్పుచున్నాడు (1 దిన. 28:5). దేవుడు రాజైన దావీదునకు ఈలాగు చెప్పెను, "నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అనెను." 2 సమూయేలు 7:16. దావీదునకు చేయబడిన వాగ్దానమును యేసు తన పునరుత్థానము తరువాత రాజు అయినప్పుడు నెరవేర్చెను (లూకా 1:30-33; అపొ. కార్య. 2:30-33). దేవుని రాజ్యము, లేదా పరలోకరాజ్యము సమీపమున వున్నదని యేసు చెప్పెను, మరియు అది పండ్రెండు మంది అపొస్తలులు జీవించిన కాలంనందు స్థాపించబడునని చెప్పెను (మత్తయి 4:17; మార్కు 9:1). సౌలు, దావీదు మరియు సొలొమోను పాలించిన అదే దేవుని రాజ్యముపై యేసు రాజైయున్నాడు (మత్తయి 8:10-12). దేవుడు ఒకే ఒక రాజ్యమును కలిగియున్నాడు. క్రైస్తవులమైన మన పౌరసత్వము అదే రాజ్యమునందు వున్నది, అయితే మనము ఒక నూతనమైన పరిపాలనను, ఒక నూతనమైన ఆత్మీయపరిధిని మరియు ఒక నూతన నిబంధనను కలిగియున్నాము. ఇప్పటికిని భూమిపై దేవుని యొక్క రాజ్యము ఉనికి కలిగియున్నది. అది యేసు క్రీస్తు యొక్క రాజ్యమైయున్నది, ఎందుచేతననగా ఆయన రాజైయున్నాడు. అయితే, తన ప్రజలకొరకైన దేవునియొక్క లక్ష్యములు (goals) ఎప్పుడును ఒకేరీతిగా నున్నవి.

### పాఠము

యేసు, విశ్వసించినవారిని లోకమునందున్న సాతాను యొక్క అధికారము నుండి "క్రీస్తునందు" వున్న ఆయన పరిపాలన క్రిందకు మార్చగల సమర్థుడు. అపొ. కార్య. 26:18; కొలొస్స. 1:12,13 చూడుము. ఆయన ప్రజలను తన రాజ్యమును గూర్చి ప్రకటించుట ద్వారా పిలచుచున్నాడు (అపొ. కార్య. 20:25). ఆ వర్తమానము నందు విశ్వాసముంచిన వారు మారుమనస్సు నొంది దేవునివైపు తిరుగుదురు (ఆయన నూతన నిబంధనను అంగీకరింతురు హెబ్రీ. 8:10-12) మరియు మన ప్రభువైన యేసు నందు విశ్వాసముంతురు (అపొ. కార్య. 20:21). ఇవి నూతనముగా జన్మించుట లోని ప్రక్రియలో ఒక్కొక్క మెట్టువైయున్నవి. సువార్త వర్తమానము మనము దేవుని యొక్క కుమారులుగా వుండుటకు సృష్టించబడితిమని మనకు తెలియజేయును. ఇది మనము దేవునితో సహవాసము కలిగి వుండునట్లు సాధ్యపరచిన దేవుని యొక్క కృపలను కూడా మనకు వెల్లడిచేయుచున్నది. యేసు మన రాజు మరియు యాజకుడై యున్నాడని మనము విశ్వసింతుము. అందుచేత, మనము నూతనముగా జన్మించుట లోని చివరి ప్రక్రియను మనము అంగీకరింతుము. ఈ ప్రక్రియలో క్రైస్తవులు పాపముల నిమిత్తమై చనిపోవుదురు మరియు వారు యేసుతో జీవము కలిగి వుండుటకు తిరిగి లేపబడుదురు. ఇది నీటిలో బాప్తిస్మమందు జరుగుచున్నది. (రోమా 6:1-10; 1 పేతురు 3:21). అపొస్తలుడైన పౌలు అతడు నూతన జన్మను గూర్చి ప్రకటించుటకు ముందు, అటువంటి నూతన జన్మ ప్రక్రియనే నెరవేర్చెను (అపొ. కార్య. 22:14-16). ఫలితముగా, నీటిమూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించిన వారందరు యేసు తన రక్తముచే కొనిన (సంపాదించిన) దేవుని యొక్క సంఘమై యున్నారు. యోహాను 3:3-6 మరియు అపొ.కార్య. 20:28 చూడుము.

యేసు యూదా నాయకులకు ఈలాగు చెప్పెను, "కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్ద నుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని మీతో చెప్పుచున్నాను." (మత్తయి 21:43). క్రీస్తు యొక్క శరీరముగా పని చేయుచున్న క్రీస్తు సంఘము ఆశీర్వాదములతో దీవింపబడినది మరియు దాని ఫలములు ఫలించు బాధ్యత కలిగియున్నది, ఎఫెసీ. 4:14-16 చూడుము. మానవాళి నుండి దేవుడు కోరుచున్న ఫలమును హెబ్రీ గ్రంథకర్త యొక్క నిర్వచనముచే మనము స్పష్టముగా అర్థము చేసుకొనగలము. పరలోకము నుండి మరలా వచ్చు యేసును గూర్చి తెలియజేసిన హెబ్రీ గంథకర్త యొక్క నిర్వచనము.

> *ఎవని నిమిత్తము సమస్తమును ఉన్నవో, యెవని వలన సమస్తమును కలుగుచున్నవో, ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా వారి రక్షణకర్తను శ్రమలద్వారా సంపూర్ణునిగా చేయుట ఆయనకు తగును. పరిశుద్ధపరచు వారికిని పరిశుద్ధపరచబడు వారికిని అందరికి ఒక్కటే మూలము. ఈ హేతువుచేతను వారిని సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడక,...*
>
> హెబ్రీ. *2:10,11.*

దేవుడు భూమిపై నుండి కోరుకొనిన ఫలమును ఏ మాత్రము హెచ్చు తగ్గులు లేకుండ యేసు దేవునికి తిరిగి తీసుకొనివచ్చునని మనము విశ్వసింతుము. ఇంకా మనము సంఘ సభ్యులుగా కొనసాగుచుండగా, యేసు దేవుని యొద్దకు తీసుకొనివచ్చు కుమారులు, కుమార్తెలను, అపొస్తలుడైన పౌలు దేవుని కుమారులుగా సూచించాడు 2 కొరింథీ. 6:17,18 చూడుము. క్రీస్తు

యొక్క సారూప్యతలోనికి మార్పునొందుటకు మరియు మన మరణ పర్యంతము వరకు విశ్వాసమునందు నిలచియుండు దేవుని యొక్క కుమారులు, కుమార్తెలు తీర్పునందు రాజ్యమును స్వతంత్రించుకొందురు లేదా పొందుదురు మరియు జీవ కిరీటమును స్వతంత్రించుకొందురు. రోమా 8:29; హెబ్రీ. 11:13; 1 పేతురు 1:3-5; యాకోబు 1:12, 2:5 చూడుము. మనము స్వతంత్రించుకొనునది మనకు ఏలాగువుండునో రోమీయులకు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయము నందలి వివరణాత్మకమైన వర్ణన నుండి మనము అర్ధము చేసు కొనగలము.

*ఆయన ప్రతివానికి వానివాని క్రియలచొప్పున ప్రతిఫలమిచ్చును (6వ వచనము)*

*సత్‌క్రియలు ఓపికగా చేయుచు, మహిమను, ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. (7వ వచనము).*

*(ఈ క్రింద చెప్పబోవు వచనము మనకు నిత్యజీవమనగా యేమైయున్నదో తెలియ జేయును). సత్‌క్రియ చేయు ప్రతివానికి, మొదట యూదునికి గ్రీసు దేశస్తునికి కూడ, మహిమయు, ఘనతయు సమాధానమును కలుగును (10వ వచనము).*

దేవుని బిడ్డలను గృహమునకు తీసుకొనిపోవుటకు వచ్చు యేసు రాకడ కొరకు క్రైస్తవులు వేచియుందురు. అపొస్తలుడైన పౌలు దీనిని ఈ క్రింది విధముగా వివరించెను.

*అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును, అప్పుడు అంతము వచ్చును.1 కొరింథి. 15:24.*

యేసు రాకడలో, నిత్య జీవమను స్వాస్థ్యమును బహుమానముగా పొందు సంఘ సభ్యులు యేసు దేవునికి తిరిగి అప్పగించు ఆ రాజ్యమునందు నిరంతరము (ఎప్పటికి) భాగమైయుందురు. క్రీస్తు సంఘముగా మన యొక్క గుర్తింపు పరలోకము నందువుండదు. అది కాలమునకు చెందినది. మనము ఇప్పుడు "బయటకు పిలువ బడినవారము," అందుచేత మనము పిలువబడినవారమై (సంఘమై) యున్నాము. మనము పిలువబడినవారము గనుక "అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను." కొలొస్స. 1:13. తీర్పు దినమునందు ఈ రాజ్యమునే మనము స్వతంత్రించు కొందుము. దేవుని కొరకు ఫలమును ఫలించుటకు యేసునకు పరిపాలన అప్పగించ బడుటకు ముందు అది దేవుని యొక్క రాజ్యమై యున్నది; దేవుని సృష్టి నుండి ఫలముగా అది మనతో దేవుని రాజ్యమైయుండును. "మరియు సమస్తమునుఆయనకు లోపరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును." 1 కొరింథీ. 15:28.

ఇప్పుడు ప్రశ్నయేమైయున్నదనగా: ఇంతకుముందు వారు అట్లు ఫలములు ఫలించలేక పోయినప్పుడు ఎందుకు నేడు దేవుని రాజ్య పౌరులు నీతియను ఫలమును ఫలించవలెను? అంతకు ముందున్న తరములు దేవుడు అనుగ్రహించిన నిబంధనలను మీరియున్నప్పుడు ఎందుకు ఇప్పుడు మనము "నిబంధన గైకొనువారై" యుండవలెను? పాప క్షమాపణ కొరకైన బాప్తిస్మము పొందుటకు ముందు మనము పొందు మారు మనస్సునందు నూతన నిబంధనను అంగీకరించవలెను. ఇది మనము నూతనముగా జన్మించుటలో ఒక ప్రక్రియయైయెయున్నది. ఇది దేవుని కుమారులుగా వృద్ధిపొందుటకు మూలమైయెయున్నది. హెబ్రీ. 8:10-12 చూడుము. ఇటువంటి ప్రశ్నలన్నిటికి నూతన నిబంధన పూర్తిగా సమాధానమై యున్నది, అయితే అది అంతయు క్రింద పేర్కొన్న లేఖన భాగమునందు క్లుప్తముగా చెప్పబడెను.

*ఈయనయైతే ఇప్పుడు మరియెక్కువైన వాగ్దానములను బట్టి నియమింపబడిన మరి యెక్కువైన నిబంధనకు మధ్యవర్తియైయున్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొందియున్నాడు.*

*హెబ్రీ. 8:6*

యేసుక్రీస్తునందు మనము విశ్వాసము కలిగినప్పుడు ఆయన వ్యక్తిగతముగా మన విజయమునకు హేతువైయున్నాడు. ఆయన మనకు రాజై యుండుటతో పాటుగా, ఆయన మన ప్రధానయాజకుడు, మన పాప పరిహారార్థబలి, మనబోధకుడు మరియు మనము అనుసరించదగు మాదిరి సహోదరుడు. మన పాఠ్యాంశమునందు (lesson text) నందు యేసు, కీర్తన 118:22,23ను పేర్కొనెను. అపొస్తలుడైన పేతురు యెషయా గ్రంథమునందలి లేఖనమును పేర్కొనెను మరియు అదే కీర్తనను పేర్కొనెను.

*ఏలయనగా - ఇదిగో నేను ముఖ్యమును ఏర్పరచబడినదియు, అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించుచున్నాను ఆయనయందు విశ్వాసముంచువాడు ఏమాత్రమును సిగ్గుపడడు, అనుమాట లేఖనమందు వ్రాయబడియున్నది. విశ్వసించు చున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు, విశ్వసింపని వారికైతే - ఇల్లు కట్టువారు ఏరాతిని నిషేధించిరో అదే మూలకు తలరాయి ఆయెను. మరియు అది అడ్డురాయియు, అడ్డుబండయు ఆయెను. కట్టువారు వాక్యమునకవిధేయులై తొట్రిల్లుచున్నారు, దానికే వారు నియమింపబడిరి. 1 పేతురు 2:6-8.*

యేసు ఈపైన పేర్కొన్న లేఖనమునకు తన రాజరికమును తిరస్కరించువారికి సంబంధించి మరొక మాటను చేర్చెను.

*మరియు ఈరాతిమీద పడువాడు తునకలైపోవును గాని అది ఎవనిమీద పడునో వానిని నలిచేయుననెను. మత్తయి 21:44*

ఇంతకు ముందు మన పాఠమునందు ఆయనను సేవించువారు అన్యుల నుండి వేరుగానుండుట ఎల్లప్పుడు ఎంత అవసరమైనదిగా దేవుడు పరిగణించెనో పాత నిబంధన గ్రంథము నుండి మనము నేర్చుకొంటిమి. అదే కార్యక్రమము నేడును జరుగుచున్నది. యేసు సియోను రాయిగా అయినప్పుడు ప్రత్యేకపరచుకొను కార్యక్రమము క్రియా రూపము దాల్చెను.

పైన పేర్కొన్న లేఖన భాగమునందు మనము రెండు గుంపులను చూడగలము: ఒకరు విశ్వాసమైన జీవితమును కట్టుకొనుటకు యేసును వినియోగించు వారు మరియు ఇంకొకరు ఆయన నుండి తొలగిపోయినవారు. సమస్త ప్రజలు రెంటిలో ఏదోఒక దానిని చేయుదురు. అనేకులు ఆయనను బట్టి అభ్యంతర పడుదురు, కాని అది వారికి ఎన్నడు తెలియదు, ఇతరులు ఉద్దేశ పూర్వకముగా ఆయనను తిరస్కరించుదురు. అయితే తమ కొరకు యేసు చేసిన సమస్త కార్యములన్నిటిని ప్రయోజనకరముగా చేసుకొని దేవుని కుమారులుగా వృద్ధి చెందుటచే తమ్మును తాము పునఃస్థాపితము చేసుకొనుటకు ప్రయాసపడు శేషము మిగిలి యుండును.

యేసు మన పాపముల కొరకు చనిపోయెను. అది మనము నూతనముగా జన్మించుటలోని చివరి ప్రక్రియను మనకు అందించుచున్నది మరియు అది నీటిలో మనము పొందు బాప్తిస్మము నందు జరుగు దేవుని యొక్క పనియైయున్నది (కొలొస్స. 2:12,13; అపొ. కార్య. 8:36). దేవుని యొక్క ప్రస్తుత ప్రత్యేకపరచుకొను కార్యక్రమము నందు క్రైస్తవుని యొక్క నూతన జన్మ వానికి విభజన రేఖను కలిగించుచున్నది. మానవాళికి అందుబాటులోవున్న రెండు పరిధులు యోహాను 15:19 మరియు 18:36 నందు లోకము మరియు క్రీస్తు రాజ్యము అని గుర్తించబడెను. అపొస్తలుడైన పౌలు ఎఫెసీ పట్టణమందున్న సంఘమునకు తను వ్రాసిన పత్రికయందు క్రీస్తు రాజుగా పాలించుచున్న పరిధిని గుర్తించుటకు "క్రీస్తు నందు" అను పదమును స్వేచ్ఛగా ఉపయోగించెను. దయచేసి ఆపత్రిక యొక్క మొదటి అధ్యాయము చదువుము. సాతాను, లోకము అను పరిధిని పాలించుచున్నాడు (ఎఫెసీ. 2:1-3).

యేసు సిలువలో చిందించిన రక్తము గత పాప శరీరమును తీసివేయుట ద్వారా నూతనముగా జన్మించునప్పుడు మన కొరకు పనిచేయును. అది క్రీస్తునందు మనము నీతిమంతులుగా తీర్చబడుటకు నిరంతరము పనిచేయును (విశ్వాస మూలముగా నీతిమంతులుగా తీర్చబడుట అను బోధను అర్థము చేసుకొనుటకు రోమా 3:21-26 చదువుము). ఆయన పునరుత్థానము మనము నీతిమంతులుగా తీర్చబడుట కొర్కై యున్నది (రోమా 4:25). మనము నీతిమంతులుగా తీర్చబడుట యేసు యాజకుడుగా చేయు ఒక పనియైయున్నది. పరిశుద్ధాత్ముడు మన బలహీనతలలో బలపరచుట మరియు మన శక్తికి మరింత శక్తినిచ్చుటకు మనలో వుండి పనిచేయుచుండగా ఫలితము దేవునితో సమాధానమైయున్నది (రోమా 5:1-5; హెబ్రీ. 12:12,13).

మనము విశ్వాసము కలిగి నడచుకొనుచున్నాము గనుక "క్రీస్తునందు" యేసు రక్తముచే మనము నిరంతరము పరిశుద్ధపరచబడుచుందుము. అందుచేత, మనము దేవుని కొరకు కుమారత్వమను ఫలమును ఫలించుచుండగా, పరిశుద్ధాత్ముడు నిరంతరము మనతో సహవాసము చేయును మరియు మన యొక్క సేవకుడుగా వ్యక్తిగతముగ మనకు సహాయము చేయును (అపొ. కార్య. 5:32; రోమా 8:12-16; 2 కొరింథి 13:14; 1 యోహాను 3:24). పరిశుద్ధాత్ముడు మనలను దేవునియొక్క వాక్యముచే నడిపించును, కాని మరి కొన్ని ఇతర పద్ధతుల ద్వారా మన అంతరంగ వ్యక్తి బలమొందునట్లు చేయుటకు కూడా ఆయన పనిచేయును (ఎఫెసీ. 3:16). ఆయన బైబిలు వ్రాసిన వారిని ప్రేరేపించెను (2 తిమోతి 3:16,17). క్రైస్తవుల కొర్కైన ఆయన యొక్క ముఖ్యమైనపని పరిశుద్ధపరచుటైయున్నది (2 థెస్స. 3:13; 1 పేతురు 1:2). మన పాఠము యొక్క లేఖన భాగమునందలి ఈ ఉపమానమును యూదా నాయకత్వమునకు యేసు చెప్పుటకు కొద్ది సమయమునకు ముందు, ప్రవక్తల గ్రంథముల నుండి లేఖనమును పేర్కొంటూ గాడిదపైనెక్కి యెరూషలేము ప్రవేశించెను.

*ఇదిగో నీ రాజు సాత్వికుడై గాడిదను భార వాహక పశువుపిల్లయైన చిన్నగాడిదను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి.* *మత్తయి 21:5*

జన సమూహము ఈలాగు ప్రతిస్పందించెను. "దావీదు కుమారునికి జయము (హోసన్నా) ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడును గాక. సర్వోన్నతమైన స్థలములలో జయము (హోసన్నా)" అని కేకలు వేయుచుండిరి (మత్తయి 21:9). ఇది యూదా ప్రజలు తమ నూతన నాయకుడి యొక్క పట్టాభిషేకమునందు ప్రదర్శించు క్రియయైయున్నది. అక్కడ యేమి సంభవించుచున్నదో వాస్తవానికి తెలిసిన వ్యక్తి కేవలము యేసు మాత్రమే. అది సంభవించెను మరియు మనము దాని ప్రయో జనములను (ఫలములను) స్వీకరించుచున్నాము (కోసుకుంటున్నాము). దేవుని రాజ్యము ఇప్పుడు మన వలెనే మానవ శరీరమునందు జీవించుటచే, బోధలను బోధించుటచే, మన భవిష్యత్తు కొర్కైన వాగ్దానములను చేయుటచే, రాజ్యము యొక్క జీవితమును కనుపరచుటచే మరియు మన పాపముల కొర్కై మరణించుటచే, తన వారి కొరకు ఆయన ప్రేమను తొలిసారిగా ఋజువుచేసుకొనిన రాజుచే పరిపాలించ బడుచున్నది. ఆయన రాజుగా అగుటకు ముందు మనకు యాజకుడుగా నుండునట్లు ఆయన తన్ను తాను యోగ్యునిగా చేసుకొనెను.

నేడు దేవుని రాజ్యమునందలి ఉన్నత స్థానములయందు మానవ ప్రమేయము పూర్తిగా తీసివేయబడెను. దేవుని సేవించుటలో ఇశ్రాయేలీయుల పక్షమునందలి అనేక తప్పిదములు వారి యొక్క నాయకత్వముపైనే మోపబడెను. సౌలు నుండి మొదలుపెడితే, కేవలము కొద్ది మంది ఇశ్రాయేలు రాజులు మాత్రమే దేవునిని సేవించిరి. ఒక మానవుడు రాజుగా నియమించబడుటకు పూర్వమే లేవీ యాజక త్వము కళంకితమాయెను. యేసు ఇప్పుడు రాజు మరియు యాజకుడైయున్నాడు.

ప్రతి స్థానిక సంఘము క్రీస్తు యొక్క శరీరముగా పనిచేసినప్పుడు మరియు ప్రాముఖ్యమైన నిర్ణయములనన్నిటిని శిరస్సైన యేసుక్రీస్తునకు విడిచిపెట్టినప్పుడు, మనము ఫలమును ఫలించగల

శక్తి కలిగియుందుము. స్థానిక సంఘములు ప్రత్యేక పరిపాలన విభాగములు మరియు ప్రత్యేక అధికారులను ఉపయోగించుచున్నప్పుడు, దేవుడు ఆజ్ఞాపించని స్థానమునందు వారు మానవుని నియమించుచున్నారు. ఇది యేసు యొక్క పరిపాలన నుండి మొట్టమొదటి తొలగుబాటు సంఘ పరిపాలనలో వచ్చిన మార్పై వున్నది. స్థానిక సంఘ పరిధికి పైనున్న సమస్త అధికార స్థానములు ఎప్పుడో ఇంత క్రితమే యేసుక్రీస్తుచే పూరించబడెను. ఆయన సంఘ పెద్దలను నియమించునట్లు ప్రతి స్థానిక సంఘమును ఆజ్ఞాపించెను (అపో. కార్య. 14:23). మానవులు తమ విద్యార్హతలచే ప్రవీణులైన వారిని సంఘమును పాలించుమని, విచారణకర్తలుగా వుండుమని బాడుగకు (అద్దెకు) తెచ్చుకొన నవసరములేదు (1 తిమోతి 3:1-7; తీతు 1:5-9).

క్రైస్తవులు ఫలమును ఫలించగలుగుటకు గల ప్రాథమికమైన కారణముయేమై యున్నదనగా నేడు దేవుని యొక్క రాజ్యమునందు మనము దైవికమైన నాయ కత్వమును కలిగియున్నాము. క్రొత్త నిబంధనలో వెల్లడి చేయబడినట్టుగా మనము ఎంతో జాగ్రత్తగా సంఘ నాయకత్వము కొరకైన దేవుని యొక్క క్రమమును (system) కొనసాగించవలెను. దేవుడు ఆశించిన ఫలమును పొందని మరియు మానవ జ్ఞానముతో నడిపించబడుచున్న మరొక పద్ధతి కలదు. మరచిపోకు! దేవుడు మనలోప్రతి ఒక్కరు ఆయన నిత్య రాజ్యమునందు ఆయన కుమారులుగా వుండవలెనని కోరు చున్నాడు. యేసు దేవుడు ఆశించిన ఫలమును ఆయనకు అప్పగించును. క్రీస్తులాంటి బిడ్డలు కావలెనను ఉద్దేశమే తను సృష్టి చేయుట కొరకైన కారణమైయున్నది, (హెబ్రీ. 12:5-11).

## చర్చ కొరకైన ప్రశ్నలు

1. ఎవరి రాజ్యముపై సొలొమోను, యేసు రాజుగా వుండిరి లేదా ప్రస్తుతము యేసు రాజుగా వుండెను?
2. దావీదునకు చేసిన ఏ వాగ్దానములను అనుసరించి నేడు మనకు రాజును అనుగ్రహించెను?
3. ఏ రాజ్యము యూదా నాయకత్వము నుండి తీసివేయబడి, వేరొక ప్రజలకు ఇవ్వబడెను?
4. ఎందుకు క్రైస్తవులు దేవుని కొరకు ఫలమును ఫలించువారిగా నుండవలెను?
5. నేడు ప్రతి క్రైస్తవుని కొరకు ప్రత్యేకపరచుకొను ప్రక్రియ ఎక్కడ నుండి ప్రారంభ మగును?
6. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట యొక్క ఫలితమేమైయున్నది?
7. ప్రజలందరు నివశించుటకు ఎంపిక చేసుకొను రెండు ఆత్మీయ పరిధులను పేర్కొనుము?
8. యేసు యెరూషలేమునకు గాడిదపైనెక్కి ప్రవేశించుటలో ప్రాముఖ్యత యేమైయున్నది?
9. ఇశ్రాయేలీయులకు అనేక సమస్యలను కలుగజేసిన యే చట్టము దేవుని రాజ్యము నుండి తీసివేయబడెను?
10. ఎందుకు సంఘమునందలి ముఖ్యమైన నిర్ణయములను దేవుని రాజ్యమునందున్న యేసునకు విడచిపెట్టవలెను?